

4 లో యోగాతోనే మానసిక దృఢత్వం


RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :200 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | బుధవారం 17 జూన్ 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad


# ట్రంప్‌తో చర్చల కోసం ఇరాన్ వినూత్న వ్యూహం

ట్రంప్‌తో శాంతి చర్చల కోసం సైకాలజిస్టులను నియమించిన ఇరాన్
ట్రంప్ మానసిక ప్రవర్తనను అంచనా వేయడమే లక్ష్యం
ఈ వ్యూహం ఫలించిందని.. ట్రంప్ స్పందన మెరుగైందని వెల్లడి
నాలుగు నెలల చర్చల తర్వాత ఇరు దేశాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం
స్విట్జర్లాండ్‌లో జరగనున్న ఒప్పందంపై సంతకాల కార్యక్రమం

అమెరికా: పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుసరించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయడానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సహాయం తీసుకున్నట్లు ఒక కథనం వెల్లడించింది. ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మిగతా 2లో...



# 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఏపీదే పేటెంట్

భారత్‌కు ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ – రెండో నివాసంగా అమరావతిని ఎంచుకోండి
సింగపూర్ పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు – సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ రోడ్ షోలో పాల్గొన్న సీఎం





**సింగపూర్:** భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఏపీ అత్యంత అనుకూల స్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఏపీదే పేటెంట్ అని, పెట్టుబడులకు ఎంతో సురక్షితమని స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖలో తలపెట్టిన పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సీఐఐ నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి సంబంధాలున్నాయి. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ మిగతా 2లో...

# జులై మూడో వారంలో 'తల్లికి వందనం'..

## విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష



**అమరావతి, సింధూరదర్శిని:** రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని మిగతా 2లో...

# విధానాలను విమర్శించండి.. వ్యక్తులను కాదు..

## అమర్నాథ్‌కు పవన్‌కల్యాణ్ క్లాస్!

'మేకప్ మంత్రి' అంటూ హోంమంత్రి అనితపై అమర్నాథ్ వ్యాఖ్యలు
మహిళల దుస్తులు, రూపంపై వ్యాఖ్యలు అవమానకరమన్న పవన్
రాజకీయ విమర్శలు విధానాలపై మాత్రమే ఉండాలని సూచన
కూటమి నేతలు సంయమనంతో స్పందించాలని హితవు



**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన 'మేకప్' వ్యాఖ్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. మహిళల దుస్తులు, రూపురేఖలపై వ్యాఖ్యానించడం వారిని అవమానపరచడమేనని స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలే తప్ప వ్యక్తిగత అంశాలపై కాదన్నారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన పవన్‌కల్యాణ్ మహిళల గురించి మాట్లాడేటప్పుడు ప్రజాప్రతినిధులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనితను లక్ష్యంగా చేసుకున్న వ్యాఖ్యలు మిగతా 2లో...



# రెండేళ్లలో శాంతిభద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణలో గణనీయ పురోగతి

ప్రజా భద్రత, సైబర్ రక్షణ, విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ విశిష్ట పురోగతి
సాంకేతికత, పారదర్శకత, జవాబుదారీతనంతో సమగ్ర సంస్కరణలు
రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి

**అమరావతి, సింధూరదర్శిని:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ల సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మిగతా 2లో...

# తమిళనాడు రైతులకు విజయ్ ప్రభుత్వం శుభవార్త

రాష్ట్రంలో రైతుల పంట రుణాల మాఫీకి నిర్ణయం
ఈ నిర్ణయంతో 14.43 లక్షల మంది రైతులకు ప్రయోజనం



**తమిళనాడు:** పంట రుణాల మాఫీ విషయంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాల మాఫీ పరిమితిని రూ. 75,000కు పెంచుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన పథకంపై వ్యక్తమైన అభ్యంతరాల నేపథ్యంలో సన్న, చిన్న, పెద్ద అనే వ్యత్యాసం లేకుండా రైతులందరికీ ఈ ప్రయోజనాన్ని వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి మిగతా 2లో...



ముత్యాల పూసల అలంకరణలో గంగమ్మ 5 లో

# ఈ నెలలోనే వెలిగొండ నిర్వాసితులకు పరిహారం

సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా పరిహారం అందజేస్తాం
రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు
ఎమ్మెల్యే కందుల, ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌లతో కలిసి జంట సొరంగాల్లోకి వెళ్లి పనులు పరిశీలన



**దోర్నాల,సింధూరదర్శిని:** ఈనెలలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ పరిహారం అందిస్తామని జలవనరుల శాఖ మంత్రి మిగతా 2లో...

## ట్రంప్‌తో చర్చల కోసం ఇరాన్ వినూత్న వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ.. “ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము” అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలు పెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో రాయిటర్స్/ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89% డెమోక్రాట్లు, 30% రిపబ్లికన్లు ఉండటం గమనార్హం.

2025 జనవరిలో 80 ఏళ్ల వయసులో ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అమెరికా చరిత్రలోనే అత్యంత వృద్ధ అధ్యక్షుడిగా రికార్డు సృష్టించారు. అప్పటి నుంచి ఆయన పలు దేశాల నుంచి దిగుమతులపై భారీ సుంకాలు విధించడం, అక్రమ వలసదారులను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా ఫెడరల్ ఏజెంట్లను మోహరించడం వంటి వేగవంతమైన, దూకుడైన నిర్ణయాలు తీసుకున్నారు. అనేకమంది విశ్లేషకులు గెలవడం కష్టమని భావించిన యుద్ధంలోకి కూడా అమెరికాను నడిపించారు. దాదాపు 4 నెలల పాటు సాగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లో శుక్రవారం సంతకాలు జరగనున్నాయి. కార్యక్రమంలో అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరపున పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పాల్గొంటా రని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి మజీద్ తఖ్త్-రవంచి తెలిపారు.

## విధానాలను విమర్శించండి.. వ్యక్తులను కాదు.. అమర్నాథ్‌కు పవన్ కల్యాణ్ క్లాస్!

(మొదటిపేజీ తరువాయి)

మహిళలందరినీ కించపరిచినట్లేనని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి మాటలను సమాజం నిశితంగా గమనిస్తుందని గుర్తు చేశారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమేనని, అయితే అవి విధానాలకు మాత్రమే పరిమితం కావాలని పవన్ అన్నారు. ఏదైనా విధానం నచ్చకపోతే దానిపై విమర్శలు చేయాలని, వ్యక్తిగత దూషణలు సరైన పద్ధతి కాదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతల వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. అలాగే అధికార కూటమి నేతలకు కూడా పవన్ సూచనలు చేశారు. ప్రతిపక్షాల వ్యాఖ్యలకు స్పందించే సమయంలో సంయమనంతో వ్యవహరించాలని, అసభ్య భాషకు తావివ్వకుండా ప్రజలు మెచ్చే రీతిలో గట్టిగా బదులివ్వాలని సూచించారు. ప్రత్యర్థి పార్టీ ఉపయోగించే భాషను కూటమి నేతలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు.

## జులై మూడో వారంలో ‘తల్లికి వందనం’..

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు. పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం, ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక ‘ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్’ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు రైతులకు విజయ్ ప్రభుత్వం శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

విజయ్ అధ్యక్షతన జూన్ 15న జరిగిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రకటన ప్రకారం, 2025 మే 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 మధ్య సహకార బ్యాంకుల్లో రూ. 75,000 వరకు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ వర్తిస్తుంది. ఒకవేళ రుణం మొత్తం రూ. 75,000 కంటే ఎక్కువగా ఉంటే, అటువంటి వారికి రూ. 35,000 మేర మినహాయింపు లభిస్తుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14.43 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై రూ. 5,932.23 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా వేస్తున్నారు. లబ్ధిదారులలో 8.33 లక్షల మంది సన్నకారు రైతులు, 5.16 లక్షల మంది చిన్న రైతులు ఉండగా, 93 వేలకు పైగా పెద్ద రైతులు ఉన్నారు. వాస్తవానికి, మే 25న ప్రభుత్వం కేవలం సన్న, చిన్న రైతులకు మాత్రమే రూ. 50,000 వరకు రుణమాఫీని ప్రకటించింది. అయితే, ఈ నిర్ణయంపై ప్రతిపక్షాలైన ఏఐఏడీఎంకే, బీజేపీలతో పాటు రైతు సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. రైతులందరికీ సమానంగా ప్రయోజనం కల్పించాలని డిమాండ్లు వెల్లువెత్తడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

# ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెల్’లో ఏపీదే పేటెంట్

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించి అందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ పారిశ్రామిక వేత్తలు అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను రెండో నివాసంగా ఎంచుకోవాలి.’ అని అన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు**

‘ఏపీలో పరిశ్రమలకు భూమి కేటాయింపు, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్‌కు అనతికాలంలోనే అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుంది. గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా హబ్ కూడా ఏర్పాటు అవుతోంది. ఆ సంస్థకు గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటినీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నాం

**ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్**

వికసిత్ భారత్ 2047 విజన్‌లాగే స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు రూపకల్పన చేశాం. త్వరలోనే భారత ఎకనామిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతుంది. ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. సుదీర్ఘమైన తీరప్రాంతం, అరుదైన ఖనిజాలు, పర్యాటక ప్రాంతాలు ఏపీ సొంతం. ఆక్వా, హార్టికల్చర్, వ్యవసాయం, సేవల రంగంలో ఏపీ కీలకమైన రాష్ట్రంగా ఉంది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా వివిధ దేశాలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. పూర్తి స్థాయి సన్నద్ధతతో ఈ సంక్షోభాన్ని కూడా భారత్ సమర్ధంగా ఎదుర్కోగలిగింది. ఏపీ నుంచి ఎగుమతులు పెంచేందుకు మేం విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నాం. దీనికి అనుగుణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించేలా పనిచేస్తున్నాం. పారిశ్రామిక అనుకూల పరిస్థితులను కల్పించేలా 26 పాలసీలు అమలు చేస్తున్నాం. ఏపీలో భూమి లభ్యత, నీటి లభ్యత ఉంది. కృష్ణా, గోదావరి నదుల ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా ఉంది. పారిశ్రామికంగా మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున కల్పిస్తున్నాం” అని ముఖ్యమంత్రి అన్నారు.

**గ్లోబల్ నగరాలకు ఏపీ కనెక్టివిటీ**

‘ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం తెచ్చాం. అలాగే ఎంఎస్ఎంఈ సహా వివిధ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాం. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎక్కడా జాప్యం లేకుండా అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తున్నాం. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతంలో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయి. ఈ పోర్టులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశీ పోర్టులకు కనెక్టు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఏపీలో ఉన్నాయి. భోగాపురం లాంటి అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. లాజిస్టిక్స్, అగ్రికల్చర్, సివిల్ ఏవియేషన్, ఎనర్జీ లాంటి వివిధ అంశాల్లో ఫంక్షనల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో ఉన్న పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలు అనుసంధానించేలా రహదారి, రైల్ నెట్వర్క్‌ను కూడా పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డ్రోన్, డిఫెన్స్ క్లస్టర్లతో పాటు రాష్ట్రంలోని 175 చోట్ల నియోజకవర్గ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పారిశ్రామిక పార్కులకు నీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాయలసీమలోని పుట్టపర్తి వద్ద 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కూడా వస్తోంది. ఈవీల వినియోగం పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నాం’ అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలెడ్జ్ హబ్‌గా అమరావతి**

‘అమరావతిని ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. బ్లూ, గ్రీన్ సిటీగా అమరావతిని నిర్మించటం తోపాటు ఈవీల వినియోగం, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. అమరావతి లోనే ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా క్వాంటం అమరావతిలో కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రాజెక్టులు పెట్టే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. త్వరలోనే విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఏపీలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి. దేవాలయాలు, పర్యాటక, బుద్దిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయి. ఆక్వా, వ్యవసాయం, హార్టికల్చర్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దఎత్తున ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండిస్తున్నాం. ఏపీకి వచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను పరీక్షించి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పిలుపునిస్తున్నాను. పెట్టుబడులు పెట్టడానికి ఇది సువర్ణ అవకాశం. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావాలని కోరుతున్నాను’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# రెండేళ్లలో శాంతిభద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణలో గణనీయ పురోగతి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి అనిత వంగలపూడి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పథంతో పునర్నిర్మిస్తూ, ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలనా వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ అనేది కేవలం అధికార ప్రదర్శన కాదని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే బాధ్యతగా ప్రభుత్వం విశ్వసి స్తోందని ఆమె తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, పోలీసు -ప్రజల సమన్వయం, సాంకేతికత వినియోగం, పారదర్శక పరిపాలన, వేగవంతమైన స్పందన, చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అని మంత్రి స్పష్టం చేశారు.

**నేర నియంత్రణలో గణనీయ పురోగతి - 14.1 శాతం క్రైమ్ రేట్ తగ్గింపు...**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిఘా వ్యవస్థలు, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, అంతర్‌శాఖ సమన్వయాన్ని మెరుగుపర్చడం ద్వారా రాష్ట్రంలో మొత్తం నేరాల శాతం సుమారు 14.1 శాతం మేర తగ్గిందని మంత్రి తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విశ్లేషణ, డిజిటల్ నిఘా వ్యవస్థల ద్వారా ఇన్విజిబుల్ పోలీసింగ్ ను అమలు చేస్తూ నేరాలను ముందుగానే గుర్తించి నిరోధించే దిశగా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు అడుగులు వేసిందన్నారు. నేరస్థుల కదలికలను పర్యవేక్షించడం, ఆధారాలను వేగంగా సేకరించడం, విచారణలను వేగవంతం చేయడం ద్వారా శిక్షల శాతం పెరిగేలా చర్యలు చేపట్టబడుతున్నాయన్నారు.

**మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం...**

ఒక మహిళ అర్ధరాత్రి కూడా నిర్భయంగా వీధిలో నడవగలిగితేనే నిజమైన స్వాతంత్ర్యం సాధించినట్టే అనే భావనతో ప్రభుత్వం మహిళా భద్రతను అత్యంత ప్రాధాన్యతా అంశంగా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ లక్ష్యంతో మహిళా రక్షణకు ప్రత్యేక విభాగాల ఏర్పాటు, ప్రతి జిల్లాలో ప్రత్యేక భద్రతా వ్యవస్థలు, సాంకేతిక ఆధారిత స్పందన యంత్రాంగం, శక్తి యాప్ ద్వారా అత్యవసర సహాయం, మహిళలపై నేరాలకు ప్రత్యేక పర్యవేక్షణ అమలు చేయబడుతున్న దన్నారు. శక్తి యాప్ ద్వారా ఇప్పటివరకు 11.15 లక్షలకు పైగా అత్యవసర గాూూ కాల్స్ అందాయని, వాటిపై తక్షణ చర్యలు కూడా తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

**ఆపరేషన్ ముస్కాన్ - వేలాది కుటుంబాల్లో మళ్లీ ఆనందం...**

తప్పిపోయిన చిన్నారులు, మహిళలు, వృద్ధులను గుర్తించి కుటుంబాలకు చేర్చేందుకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ అత్యంతంగా విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 8,396 మంది తప్పిపోయిన వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు తిరిగి చేర్చడం జరిగిందన్నారు. ఈ విజయాలు పోలీసు శాఖ మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తున్నదని మంత్రి తెలిపారు.

**చిన్నారుల రక్షణలో రాజీలేని వైఖరి...**

పోక్సో కేసులను ప్రభుత్వం అత్యంత సున్నితమైన అంశంగా పరిగణిస్తూ చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు బృందాలు, వేగవంతమైన ఫోరెన్సిక్ పరీక్షలు, ప్రత్యేక ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు బాధితులకు మానసిక, సామాజిక సహాయం అందించడం జరుగుచున్నదన్నారు. ఇప్పటివరకు 2,293మంది చిన్నారులకు కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించబడ్డాయని తెలిపారు.

**డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో చారిత్రాత్మక చర్యలు...**

గతంలో రాష్ట్రాన్ని తీవ్రంగా కలవరపరిచిన గంజాయి, మాదకద్రవ్యాల సమస్యపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడం వల్ల మంచి ఫలితాలు కనిపించాయని మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన EAGLE ద్వారా అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్కులపై దాడులు, గంజాయి సాగు నిర్మూలన, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా రక్షించే అవగాహన చర్యలు చేపట్టబడ్డాయన్నారు. ఫలితంగా 56,674 గంజాయి కేసులు నమోదు, 2,366 మందిపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు 4కోట్లకు పైగా విలువైన ఆస్తుల స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జీరో గంజాయి సాగు లక్ష్యంతో సమగ్ర చర్యలు అమలులో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆమె పేర్కొన్నారు.

# ఈ నెలలోనే వెలిగొండ నిర్వాసితులకు పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

నిమ్మల రామానాయుడు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్‌లో నీళ్ళు నింపడానికి నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్‌లో రూ 905 కోట్లు కేటాయించామని స్పష్టం చేశారు. మంగళవారం అధికారులతో కలసి దోర్నాలలో వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లోకి వెళ్లి టన్నెల్ లైనింగ్, టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్టులో హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్లు పనులు పూర్తి చేశామని తెలిపిన మంత్రి నిమ్మల కొల్లంవాగు నుండి 1 టిఎంసి నీరు టన్నెల్స్‌లోకి చేరేలా 1.80లక్షల క్యూబిక్ మీటర్ల కు గానూ, ఇప్పటికి 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించామని, అదేవిధంగా టన్నెల్-1లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న 1. 20 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగింపు పనులలో ఇప్పటికి 40 వేల క్యూబిక్ మీటర్లు తొలగించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల్లో టన్నెల్-2లో 7 కి.మీ లైనింగ్‌కి గానూ, 5.5 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశామని, మిగిలిన 1.5 కి.మీ లైనింగ్, జూలై చివరి నాటికి పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి స్పష్టం చేశారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో హైకోర్టు ఆదేశాలతో టన్నెల్-2లో చిక్కుకుపోయిన టన్నెల్ బోరింగ్ మెషిన్ వెలికితీత పనులు చేపట్టి, మొత్తం 7 కంపార్ట్మెంట్‌లలో ఇప్పటికి 3 కంపార్ట్ మెంట్లు బయటకు తీసుకొచ్చామని టన్నెల్ బోరింగ్ మెషిన్‌లో క్లిష్టమైన హెడ్‌ను అక్కికక్కడే టన్నెల్‌లోనే పూడ్చిపెట్టడానికి అవకాశాలు పరిశీలిస్తున్నాం అని పేర్కొన్నారు. ఫీడర్ కెనాల్‌లో 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ పనులు, జనవరిలో ప్రారంభించి నేటికి 5 నెలల్లో పూర్తి చేశామని తెలిపిన మంత్రి నిమ్మల, నత్తనడకన సాగుతున్న 21 కి.మీ లైనింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. మెంధా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్‌లో పడిన భారీ గండికి సిసి వాల్ నిర్మించి పూర్తి చేయబోతున్నాం అని అన్నారు. తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్స్‌తో పాటు పర్మనెంట్ డైవర్షన్ రోడ్డు పనులు సైతం జూన్ నెలాఖరు నాటికి పూర్తికానున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం, సీజన్ మొదలయ్యే నాటికి నల్లమలసాగర్ రిజర్వాయర్ నింపేలా పనులు జరుగుతున్నాయి అని తెలిపారు. వైసీపీ నాయకులు వెలిగొండకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదు అంటూనే వెనుకబడిన ప్రకాశం జిల్లా ప్రజలకు తమ గొడ్డలి పార్టీ నాయకుడు చేసిన మోసాన్ని ఒప్పుకున్నారని అన్నారు. ఐదేళ్ళలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వారిని ఇబ్బంది పెట్టారని, కూటమి ప్రభుత్వం అదనపు బడ్జెట్ లో నిధులు కేటాయించి వారికి అండగా నిలబడ్డామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, వెలిగొండ ప్రాజెక్ట్ సీఈ రమేష్ బాబు, ఎస్.ఈ అబూతలేం, ఇతర ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నెల్లూరు బిఎస్ఎన్ఎల్ రాష్ట్రంలో నెంబర్ వన్



## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లాభాల్లో నెల్లూరు బిఎస్ఎన్ఎల్

నెల్లూరు (సింధూర దర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా; నెల్లూరు బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ రాష్ట్రంలో నెంబర్ స్థానంలో ఉందని పార్లమెంటు సభ్యులు, టెలికాం అడ్వైజరీ కమిటీ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. నెల్లూరులోని బిఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో అనేక టెలికాం సమస్యలను వారు చర్చించామన్నారు. గత సమావేశంలో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు లేవనెత్తిన సమస్యలన్నిటిని అధికారులు పరిశీలించారన్నారు. చాలావాటికి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు సమాదానం కూడా తెలిపారన్నారు. జిల్లాలో నూతనంగా 28 సెల్ టవర్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. 82 సెల్ ఫోన్ టవర్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా ఉదయగిరి నియోజకవర్గంకు 34 సెల్ ఫోన్ టవర్లు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. ప్రసుత్తం 60 శాతం అందుబాటు ఉన్నచోట మాత్రమే బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం అందుబాటు ఉండే చోట కూడా సెల్ ఫోన్ టవర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలో ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ సిగ్నల్స్ మరింత విస్తృతం అవుతాయన్నారు. గత రెండేళ్ల నుంచి జిల్లాలోని బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ లాభాలను ఉందన్నారు. గత ఏడాది రూ.48 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

ఈ ఎడాది రూ.49కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ నేడు లాభాల్లో ఉందన్నారు. ఉద్యోగులు, సిబ్బంది బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ ను తమ సొంతంగా భావించి పనిచేస్తున్నారన్నారు. జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు అందరం సంతోషంగా ఉన్నామని, తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో జిల్లాలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ముందంజలో ఉండడం ఎంతో సంతోషదాయకమన్నారు. భవిష్యత్తులో కూడా అడ్వయిజరీ కమిటీ సభ్యులందరూ చురుకుగా పాల్గొనాలన్నారు. సభ్యులు ఇచ్చిన సమస్యలను మరలా సమావేశంలో పూర్తి చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ సభ్యులు, బిఎస్ఎన్ఎల్ అదికారులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి



## విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు

నెల్లూరు (సింధూర దర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా జిల్లా ; ఇంచార్జి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సౌజన్య సూచనలతో వేదాయపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బి.వి. నగర్, అన్నగుంట ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు 30 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొంది. ఆపరేషన్ సందర్భంగా ప్రాంతంలోని నివాసాలు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు ఇతర కదలికలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనపరచుకుని తదుపరి పరిశీలన నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహన యజమానులు అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. అదేవిధంగా పాత కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న 5 మంది రౌడీ షీటర్ల నివాసాలను తనిఖీ చేసి, వారి కార్యకలాపాలపై వివరాలు సేకరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు.

అనంతరం స్థానిక ప్రజలకు ఆస్తి సంబంధిత నేరాల నివారణ, ఇళ్ల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం, అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 మరియు 112 సేవలను వినియోగించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్ధవంతంగా సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడుతున్నాయని పోలీసులు తెలిపారు.

# సైదాపురంలో ఘనంగా కూటమి విజయోత్సవసభ: ఎమ్మెల్యే



గూడూరు ( సింధూరదర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా; వెంకటగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. సైదాపురంలో గురువారం నిర్వహించిన కూటమి విజయోత్సవ సభలో ఆయన ముఖ్యనేతలతో పాల్గొని ప్రసంగించారు. ముందుగా సైదాపురం మండల కేంద్రంలో సాయిబాబా మందిరం నుంచి రాపూరు కూడలి వరకు నాయకులు, కార్యకర్తలు, భారీర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాణాసంచా కాల్చి, డబ్బు వాయిద్యాలు మధ్య ఉత్సాహంగా సాగిన ర్యాలీలో ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణను నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 1800కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. సైదాపురం మండలంలో దశాబ్దాలుగా వేధిస్తున్న త్రాగునీటి ఎత్తడి ని శాశ్వతంగా పరిష్కరించేందుకు రాపూరు చెరువును రిజర్వాయర్ గా మార్చనున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సంకల్పంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు , గంగోటి నాగేశ్వరరావు, బిజెపి నాయకులు ఎస్ఎస్ఆర్ నాయుడు, సొసైటీ డైరెక్టర్ రాఘవరెడ్డి, ఏఎంసీ చైర్మన్ వాణి, కేపీ రాజు, సురేంద్ర, విజయ రాఘవరెడ్డి, విజయరెడ్డి, మధు, రమేష్ బాబు ,చాంద్ కాశీం, శ్రీనివాసులు నాయుడు, హరినాథ్ రెడ్డి, వెంక టేశ్వరరెడ్డి, నరసరాజు, కోటయ్య నాయుడు, వెంకటేశ్వరరాజు, రమణయ్య నాయుడు, గోవర్ధన్, మల్లికార్జునగౌడ్, వెంకటేశ్వర్లు యాదవ్, సుబ్బానాయుడు, వెంకీచౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేయాలి

## తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేసిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు



గూడూరు ( సింధూర దర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా ; గాంధీనగర్ లోని అర్హులైన ఎస్సీ ఎస్టీ బీసీ కుటుంబాల వారికి ఇంటి నివేశ స్థలాలు పంపిణీ చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు ఏసుపాకు పెంచలయ్య డివిజన్ అట్రాసిటీ సభ్యులు రావూరు సురేంద్ర, శ్రీపాదం ఉదయ్ కుమార్ , అంకిరెడ్డి రమేష్రెడ్డి ఆధ్వర్యంలో 50 మంది గిరిజనులతో ఎమ్మార్వో రాపూరు వెంకటప్రసాద్ ని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గూడూరు అర్బన్ ఏరియా పరిధిలోని గాంధీ నగర్ లో ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురి అవుతున్నాయని, ఆక్రమణలు తొలగించి గాంధీ నగర్ లోని అర్హులైనటువంటి ఎస్సీ, ఎస్టీ,బీసీ కుటుంబాలకు ఇంటి నివాస స్థలాలు మంజూరు చేసి కాలనీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని పలుమార్లు ప్రజా దర్బార్లో శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ కి అర్జీలు ఇవ్వడం జరిగింది. వారు వెంటనే స్పందించి తాసిల్దార్‌కి సదర సమస్యను పరిశీలించి ఆక్రమణలు తొలగించి అర్హులైన వారికి పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని చెప్పడం జరిగింది. అయితే ఎమ్మార్వో స్పందించి, గాంధీనగర్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించడం జరిగింది. ఆక్రమణలు తొలగించారు గాని ఇంత వరకు అర్హులైన వారికి పొజిషన్ పట్టాలు, ఇవ్వడం గానీ ,స్థలాలు వారికి అప్పజెప్పడం కానీ జరగలేదు. ప్రశాంత్ నగర్ లో క్లియర్ చేసిన స్థలాలలో పై భాగంలో ఉన్న స్థలంలో 50గిరిజన కుటుంబాలకు స్థలాలు ఇవ్వాలని చెప్పడం జరిగింది. కానీఇప్పటికీ దాదాపు రెండు సంవత్సరాలు కావొస్తుంది. కేవలం రెవిన్యూ వారి నిర్లక్ష్యం వల్ల గాంధీనగర్‌లో ఉండే స్థలాలు ఆక్రమణలకు గురి అవుతున్నాయి. కావున రెవెన్యూ వారు స్పందించి ఎమ్మెల్యే చెప్పినట్లుగా వారికి వెంటనే పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని లేని పక్షంలో జిల్లా స్థాయి అధికారులను కలుస్తామని నాయకులు తెలియజేయడం జరిగింది.

# మహిళలు స్వయం ఉపాధి పొందాలి

## రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ



గూడూరు (సింధూరదర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో రోటరీ వెస్ట్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందులో భాగంగా మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఉద్దేశంతో కుట్టు మిషన్లు ఇవ్వటం జరిగిందని అన్నారు. ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునిగిరిష్ మాట్లాడుతూ డిస్టిక్ గవర్నర్ ద్వారా వచ్చిన ఈ కుట్టు మిషన్లని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రాఘవరెడ్డి, గోపాల్ రెడ్డి, వాసు గౌడ్, సనత్ రెడ్డి, నాసిన నాగులు, కృష్ణంరాజు, మూలి హరినాథ్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరి శ్రీనివాసులు, కోట కృష్ణ, గిరిబాబు, సిద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్ రెడ్డి బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన పంటలను ఆదుకోవాలి

## డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి

## సీపీఐ నాయకులు డిమాండ్



గూడూరు (సింధూరదర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా; ఉద్యానవన పంటలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ లు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పక్షపాతి అనిచెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఉద్యాన వన రైతులను ఆదుకోవాలన్నారు. ఇప్పటికే వర్షాలు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెట్ట ప్రాంతాల రైతులు డ్రిప్ ఇరిగేషన్ మీదే ఆధారపడి పంటలను పండిస్తున్నారన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో రెండు వేల కోట్ల రూపాయలను డ్రిప్ ఇరిగేషన్ పరికరాల కంపెనీ లకు బాకాయిలను మంజూరు చేస్తే వారు రైతులకు సకాలంలో పరికరాలను అందచేస్తారన్నారు. ఇకనైనా ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పై దృష్టి సారించాలని, అదేవిధంగా రైతులకు రాయితీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ. ఐ.టి. యు.సి జిల్లా అధ్యక్షులు కె.నారాయణ, జితేంద్ర, రాజేష్, వినయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొండాగుంటలో అంగన్వాడి "బడిబాట" కార్యక్రమం




గూడూరు (సింధూరదర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు మండల పరిధిలోని కొండాగుంట గ్రామము నందు అంగన్వాడి "బడిబాట" కార్యక్రమం నిర్వహించడంమైనది. పిల్లలు ప్రైవేట్ స్కూలు నందు కాకుండా అంగన్వాడి కేంద్రంలో పిల్లలు బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది అనే వినాధాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.సి.డి.పి.ఓ శారదాంబ, సెక్టార్ సూపర్వైజర్ ఎన్.స్వరూపారాణి, అంగన్వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ, జయమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలకు గురికాకుండా చూడాలి

## కమిషనర్ వై ఓ.నందన్



నెల్లూరు ( సింధూర దర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా; నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక నరకూరు ప్రాంతంలో డ్రైన్ కాలువల పూడికతీత పనులను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. క్రమం తప్పకుండా డ్రైను కాలువలలో పూడికతీత, సిల్ట్ వ్యర్థాల ఎత్తివేత పనులను నిర్వహించి మురుగునీటి ప్రభావం సాఫీగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. డ్రైను కాలువలను ఆక్రమించి మెట్లు ర్యాంపులు లాంటి నిర్మాణాలు చేపట్టకుండా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రహంతు జానీ, ఈ.ఈ అనిల్ కుమార్, టౌన్ ప్లానింగ్ విభాగం ఏసిపి వేణు, వార్డు సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.



## యోగాతోనే మానసిక దృఢత్వం

**కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**

**యోగాను జీవన విధానంగా మార్చుకోవాలి**

**రామతీర్థం బీచ్ సామూహిక యోగాకు విశేష స్పందన**

నెల్లూరు (సింధూరదర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర ప్రజలందరూ యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, తమ దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకొని జీవన విధానంగా మార్చుకోవాలని, ఉన్నత మైన ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యోగాంధ్రా కార్యక్రమం చేపట్టారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా విడవలూరు మండలం రామతీర్థం సాగర తీరం వద్ద మంగళవారం నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా తోపాటు కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు.అందమైన సాగర తీరంలోమనసుకు హాయి గొలిపే ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న మన జీవనశైలిలో, ఒత్తిడి లేని జీవితం కోసం ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలనేది మన సిఎంగారి ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంట్లో రోజుకు కనీసం అరగంట సేపు యోగా చేయడం ద్వారా, వారిని చూసి పిల్లలు, పెద్దలు అందరూ ప్రేరణ పొందుతున్నా రన్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు.యోగాతో పాటు పది నిమిషాలు మెడిటేషన్ (ధ్యానం) చేయడం వల్ల ఆలోచనలు సక్రమమైన మార్గంలో ఉంటాయని, ప్రతికూల ఆలోచనలు (నెగటివ్ థాట్స్) తొలగిపోయి, సానుకూలత పెరుగుతుందని వివరించారు.మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే ఈ యోగాను చూసి విదేశాలవారు కూడా నేర్చుకుంటున్నారని, మనకు అందుబాటులో ఉన్న ఈ యోగాను ప్రతి ఒక్కరూ నిత్యం ప్రాక్టీస్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ఇంత చక్కగా ఏర్పాటుచేసిన నాయకులకు, కార్యకర్తలకు పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా యోగాలోని ప్రతి ఆసనం ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలను వివరంగా తెలియజేస్తూ యోగాసనాలను యోగా గురువు డా.స్వప్న చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుగారు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**




తిరుపతి (సింధూర దర్శిని) 16 జూన్ తిరుపతి జిల్లా ; ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం నుండి భూపరిపాలన, రెవెన్యూలకు సంబందించి 22 ఏ,వెబ్ ల్యాండ్, రీ సర్వే, పి జి ఆర్ ఎస్, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, సీజనల్ కండిషన్స్(ప్రకృతి వ్యవసాయ పద్ధతి. వాతావరణ మార్పుల నుంచి పంటలను కాపాడటానికి ) నీట్ పరీక్షలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మరియు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) జి.జయలక్ష్మితో కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ నిర్వహించగా జిల్లా నుండి జాయింట్ కలెక్టర్ ఆర్ గోవింద రావు తో కలసి జిల్లా కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్ పాల్గొన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 22 ఏ,వెబ్ ల్యాండ్, రీ సర్వే, పి జి ఆర్ ఎస్, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, సీజనల్ కండిషన్స్(ప్రకృతి వ్యవసాయ పద్ధతి. వాతావరణ మార్పుల నుంచి పంటలను కాపాడటానికి ) నీట్ పరీక్షలు, తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మరియు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) జి. జయలక్ష్మి తో కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ దిశా నిర్దేశం చేసారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు. తిరుపతి, సూళ్లూరుపేట ఆర్ డి ఓ లు రామ్మోహన్, దేవేంద్ర రెడ్డి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్ మాండ్ , భరత్ నాయక్, ల్యాండ్ అండ్ సర్వే అధికారి రాంప్రసాద్, సెక్షన్ సూపరింటెండెంట్స్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరం పై పోలీసులు మెరుపు దాడులు



గూడూరు(సింధూరదర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కి రాబడిన సమాచారం మేరకు మరియు ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం చిల్లకూరు చెరువు వద్ద పేకాట స్థావరంపై చిల్లకూరు ఎస్సై మరియు గూడూరు రూరల్ ఎస్సై తిరుపతయ్య వారి సిబ్బందితో దాడి చేయగా 10 మంది పేకాట ఆడుతున్న వ్యక్తులను , 50 వేల రూపాయలు నగదును 6 మోటార్ సైకిల్ ను 8 సెల్ ఫోన్లు పట్టుకోవడం జరిగినది.

# భూ యజమానుల సహకారంతో శాశ్వత పరిష్కారానికి చర్యలు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**




తిరుపతి( సింధూర దర్శిని) 16 జూన్ తిరుపతి జిల్లా; దామినేడు గ్రామంలో 22-ఏ జాబితాలో నమోదైన భూముల సమస్యను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దామినేడు గ్రామ సమస్య అనేక సంవత్సరాలుగా కొనసాగుతోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు, భూ యజమానుల సహకారంతో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. దామినేడు, శెట్టిపల్లి, శ్రీనివాసపురం, పద్మావతిపురం, అవిలాల, సాయినగర్, చైతన్యపురం తదితర ప్రాంతాల్లో భూ సంబంధిత సమస్యలను దశలవారీగా పరిష్కరించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇటీవల శెట్టిపల్లి సమస్య పరిష్కారానికి చేపట్టిన చర్యల మాదిరిగానే దామినేడు సమస్య పరిష్కారానికి కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.దామినేడు సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. దామినేడు ప్రాంతంలో సుమారు 262 ఎకరాల భూమికి సంబంధించిన అంశం ఉన్నప్పటికీ, చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా భూములు కొనుగోలు చేసిన సుమారు 1,500 మంది భూ యజమానుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భూముల విలువ, సమస్య సంక్లిష్టత దృష్ట్యా అత్యంత జాగ్రత్తగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశం రెవెన్యూశాఖకు కష్టంతో కూడుకున్నదే అయినప్పటికీ, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నతాధికా రులు కూడా ఈ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని వెల్లడించారు.ప్రజలందరూ ఒకే అభిప్రాయంతో ముందుకు వచ్చి సహకరిస్తే నెలల వ్యవధిలో సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రక్రియను పూర్తి చేయగలమని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భూ యజమానుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి, స్పష్టమైన ఆదేశాలతో ముందుకు సాగుతామని తెలిపారు. సమావేశం సందర్భంగా దామినేడు ప్రాంత భూ యజమానుల సమస్యలను జిల్లా కలెక్టర్ కు వివరించగా భూ యజమానులు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.దామినేడు గ్రామంలో 22-ఏ జాబితాలో నమోదైన భూముల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ, దామినేడు ప్రాంతంలో రైతులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు దశాబ్దాల క్రితమే చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా భూములు కొనుగోలు చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ భూములు 22-ఏ జాబితాలో ఉండటంతో క్రయవిక్రయాలు జరపలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యపై ఇప్పటికే పలువురు కోర్టులను ఆశ్రయించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని తెలిపారు. సమస్య తీవ్రతను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని ఆదేశించారని వెల్లడించారు. దామినేడు ప్రాంతంలో సుమారు 1,500 మంది భూ యజమానులు ప్రభావితమవుతున్నారని, వారిలో చిన్నచిన్న స్థలాల యజమానుల నుంచి అధికముగా భూములు కలిగిన వారివరకు వివిధ వర్గాల ప్రజలు ఉన్నారని తెలిపారు. అందరూ చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారానే భూములు కొనుగోలు చేసిన విషయం వాస్తవమని పేర్కొన్నారు.శెట్టిపల్లి సమస్య పరిష్కారానికి అనుసరించిన విధానాలను పరిశీలిస్తూ, దామినేడు సమస్యకు కూడా చట్టబద్ధమైన, ఆచరణ సాధ్యమైన పరిష్కార మార్గాన్ని రూపొందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ ఒకే అభిప్రాయంతో సహకరిస్తే త్వరలో పరిష్కార ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మరియు రెవెన్యూ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ కూడా సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.
సుమారు 262 ఎకరాల విలువైన భూములకు సంబంధించిన ఈ అంశం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ, ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సమస్య పరిష్కారమైతే దామినేడు ప్రాంత అభివృద్ధికి దోహదపడటంతో పాటు భూ యజమానులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు.
ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి, స్పష్టమైన వివరాలతో ముందుకు వెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ శారదా దేవి జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, రెవెన్యూ అధికారులు, ఇతర జిల్లా అధికారులు, దామినేడు గ్రామ రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలనలో ప్రగతి పథంలో రాష్ట్రం

**కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి- నెల్లూరులో ఘనంగా జిల్లా స్థాయి విజయోత్సవం**




నెల్లూరు ( సింధూర దర్శిని) 16 జూన్ నెల్లూరు జిల్లా ; రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం ప్రగతి పథం లో పయనిస్తోందని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీపవన్ కళ్యాణ్ , యువనేత నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలులో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తో కలసి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెండేళ్ల క్రితం ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కూటమికి అధికారమిచ్చారన్నారు. నేడు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని అక్షరాల నిజం చేసి ఎంతో గర్వంగా వారి ముందుకు వచ్చామని హర్షం వ్యక్తం చేశారు.ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలను ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒకటో తేదీకల్లా అవ్వాతాతల చేతుల్లో పెన్షన్ పెడుతున్నామని, 'తల్లికి వందనం' కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఆర్థిక సాయాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, 'అన్నదాత సుఖీభవ' ద్వారా ప్రతి రైతు ఖాతాలో రూ. 20 వేలు పడేలా చూస్తూనే, మత్స్యకార భరోసా రూ.20 వేల ను కూడా అందిస్తున్నామని వివరించారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 200 పైగా 'అన్నా క్యాంటీన్లు' ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో వీటి సంఖ్య మరింత పెరుగుతాయన్నారు. పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దుతామన్న డిప్యూటీ సీఎం శ్రీ పవన్ కళ్యాణ్ గారి పిలుపునకు అనుగుణంగా గ్రామీణ రోడ్ల రూపురేఖలు మార్చామని ప్రశాంతి రెడ్డి గారు తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం కొబ్బరికాయలు కొట్టి వదిలేసిన ముదివర్తి కాజ్వే, మల్దేవి డ్రైన్లను, అలాగే పీటర్స్ కెనాల్ బ్రిడ్జ్ వంటి ఎన్నోపనులను, కల్వర్టులను ఈ రెండేళ్లలోనే పూర్తి చేశామన్నారు. ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే దాదాపు రూ. 600 కోట్లతో రోడ్లు, ఇరిగేషన్, ఇతర మౌలిక వసతుల పనులను విజయవంతంగా పూర్తి చేశామన్నారు., రాబోయే మూడేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.యువనేత మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 'భయం తీసేసి భవిష్యత్తును' ఇస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ రెండేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల విలువైన ఫ్యాక్టరీలు, పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, ఇప్పటికే 6 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామన్న హామీని నిలబెట్టుకుంటూ, కూటమి ప్రభుత్వం రాగానే దాన్ని పూర్తిగా రద్దు చేసిందన్నారు. నేడు ప్రతి రైతుకూ 'రాజముద్ర'తో కూడిన నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను అందించి భూములపై పూర్తి హక్కులు కల్పించామన్నారు. గతంలో రీసర్వే పేరుతో రైతుల భూములను ఇష్టారాజ్యంగా నిషేధిత జాబితా (22ఏ )లో చేర్చి ఇబ్బందులకు గురిచేశారని, ప్రస్తుత ప్రభుత్వం 22ఏ ఆంక్షలను తొలగించి 'మీ భూమి - మీ హక్కు' అనే నమ్మకాన్ని రైతుల్లో కల్పించిందన్నారు..నెల్లూరు జిల్లాలో సాధించిన 10 కి 10 అసెంబ్లీ స్థానాల విజయంతో.. జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్ను శుక్లా, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా ప్రగతి పథంలో దూసుకుపోతోందని, రాబోయే రోజుల్లో ప్రజల అండదండలతో కూటమి ప్రభుత్వం నెల్లూరును మరింత అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రాంగణంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను అతిథులతో కలసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జూలై 1న ఆంధ్రప్రదేశ్ నుంచి 'వీబీ - జీ రామ్ జీ' పథకం జాతీయ ప్రారంభోత్సవం : శివరాజ్ సింగ్‌చౌహాన్

**కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు.**

**ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ నమూనా ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారుతుంది శివరాజ్ సింగ్ చౌహాన్**

**"గ్రామీణాభివృద్ధి పథకాల పరిధిలోని అన్ని పనులు జియో-ట్యాగింగ్, ముఖ గుర్తింపు విధానంతో దాదాపుగా పూర్తయ్యాయి" : పవన్ కళ్యాణ్**



విజయవాడ, సింధూరదర్శిని:
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ఈరోజు న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ఉపాధి కల్పన, జీవనోపాధి పెంపు, పంచాయతీల అభివృద్ధి, వివిధ కేంద్ర పథకాల అమలుపై చర్చలు జరిపారు. ఈ ముఖ్యమైన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రస్తుత స్థితి, భవిష్యత్ ప్రణాళికలపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) ' జాతీయ ప్రారంభోత్సవం 2026 జూలై 1న ఆంధ్రప్రదేశ్ నుండి జరుగుతుందని ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి మంత్రులు తమ తమ రాష్ట్రాల్లోని వివిధ క్షేత్రస్థాయి ప్రాంతాల నుంచి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గురించి తెలియజేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చేసిన ఆదర్శ పంచాయతీలు, వ్యర్థరహిత గ్రామ పంచాయతీల పనుల గురించి కూడా అవగాహన కల్పిస్తామని శ్రీ చౌహాన్ తెలిపారు. గ్రామీణ పరిపాలన, సుస్థిర అభివృద్ధి, సామాజిక భాగస్వామ్యం వంటి రంగాలలో రాష్ట్రం తన ఉత్తమ నమూనాలను, ఆవిష్కరణలను ప్రదర్శిస్తుందని, తద్వారా ఇతర రాష్ట్రాలు ఈ విజయవంతమైన అనుభవాల నుండి నేర్చుకోగలవని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానాన్ని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. ఇది దేశంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రాలలో ఒకటి అని, అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలను వేగంగా తీసుకుంటున్నారని అభినందించారు. గ్రామీణాభివృద్ధి రంగంలో రాష్ట్రం మరిన్ని ఆవిష్కరణలు చేయాలని, తద్వారా ఇతర రాష్ట్రాలు కూడా దాని నుండి స్ఫూర్తి పొందుతాయని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చేసిన విజయవంతమైన నమూనాలు, ఆవిష్కరణలను దేశంలోని ఇతర రాష్ట్రాలతో పంచుకోవడం ద్వారా, గ్రామీణాభివృద్ధిలోని ఉత్తమ పద్ధతులను భారతదేశం అంతటా విస్తృతంగా వ్యాప్తి చేసి, స్వీకరించేలా చేయవచ్చని అన్నారు.
పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి పనులు, పథకాల పురోగతి గురించి సమాచారం తెలియజేస్తూ.. పారదర్శకతను నిర్ధారించడానికి, అవినీతికి ఎలాంటి ఆస్కారం లేకుండా చేయడానికి, గ్రామీణాభివృద్ధి పథకాల కింద చేపడుతున్న అన్ని పనులకు జియో-ట్యాగింగ్ చేశారని అన్నారు. లబ్ధిదారుల ధృవీకరణ కోసం ముఖ గుర్తింపు ఆధారిత వ్యవస్థ పని కూడా దాదాపుగా పూర్తయిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద గ్రామీణ రోడ్లు, ఇళ్ల నిర్మాణం వేగంగా పురోగమిస్తోందని తెలియజేశారు. రాష్ట్రంలోని ప్రతి పంచాయతీలో పశువులకు తాగునీటి సౌకర్యాలు కల్పించామని, దీనివల్ల గ్రామీణ పశుపోషకులకు ప్రయోజనం చేకూరుతోందని, వారి జీవనోపాధి పరిస్థితులు మెరుగుపడుతున్నాయని తెలియజేశారు. వీబీ - జీ రామ్ జీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ. 7,700 కోట్లకు పైగా మధ్యంతర నిధులను అందించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ గణనీయమైన మద్దతు రాష్ట్రంలో వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి సహాయపడుతుంది అన్నారు. రాష్ట్రం సాధించిన విజయాల పట్ల కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ సంతృప్తి వ్యక్తం చేస్తూ.. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సాధ్యమైనంత మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. నూతన ఆవిష్కరణల ఆధారిత అభివృద్ధి నమూనాలను అవలంబించి, వాటిని విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రోత్సహించారు. ఈ సమావేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో కాఫీ తోటల పెంపక కార్యకలాపాలను వీబీ-జీ రామ్ జీ కింద చేర్చినట్లు తెలిపారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొత్త జీవనోపాధి అవకాశాలు ఏర్పడి, ఆదాయ వనరులలో వైవిధ్యం చేకూరుతుంది. సుస్థిర వృద్ధిని ప్రోత్సహించేందుకు తీర ప్రాంతాల్లో ఆదర్శ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది. జూన్ 28, 29 తేదీలలో న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొనవలసిందిగా శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, శ్రీ పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఈ సదస్సులో, వీబీ-జీ రామ్ జీ పథకం యొక్క సమర్థవంతమైన అమలు, రాష్ట్రాల అనుభవాల వినిమయం, గ్రామీణాభివృద్ధిలో నూతన ఆవిష్కరణలపై సవివరంగా చర్చలు జరగనున్నాయి. అన్ని రాష్ట్రాల మధ్య ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఈ వేదిక సహాయపడుతుంది.

ఈ సమావేశంలో, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ రోహిత్ కన్సల్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో ఆదర్శ పంచాయతీల అభివృద్ధికి మంత్రిత్వ శాఖ అన్ని విధాలా మద్దతు అందిస్తుందని తెలిపారు. తీరప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ నమూనాలు, గ్రామీణాభివృద్ధి, స్థానిక వనరులను మెరుగ్గా ఉపయోగించుకోవడానికి ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గ్రామీణ జీవనోపాధి, మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు, 'లక్ పత్ దీదీలు'గా ప్రసిద్ధి చెందిన మహిళా స్వయం సహాయక బృందాలకు వాహనాలు కొనుగోలు చేసే కార్యక్రమానికి మంత్రిత్వ శాఖ మద్దతు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అవసరమైన ఆమోదం ఇచ్చింది. ఈ చర్య గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి రోహిణి ఆర్. భజిభకరేతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.


## ముత్యాల పూసల అలంకరణలో గంగమ్మ



తిరుపతి (సింధూర దర్శిని) 16 జూన్ తిరుపతి జిల్లా ; తిరుపతి పట్టణము నందు వెలసియున్న శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం నందు 2026 గంగజాతర తరువాత వచ్చు వారాలు సందర్భంగా ఐదవ వారమైన మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకము చేసిన అనంతరము అలంకరణ దాతలైన కవిత, శివకుమార్ మరియు లీలాచంద్ర సహకారముతో ముత్యాల పూసలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమములో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ మరియు కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ని కలిసి పలు అంశాలపై వినతిపత్రం

**వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,**



కడప, సింధూరదర్శిని:కడప జిల్లా కలెక్టర్ ని కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు వినతి పత్రాన్ని అందజేశారు అలాగే ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నా యనే అనుమానాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, దీనిపై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గత కొన్ని రోజు లుగా నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర గారు వ్యవహ రిస్తున్న తీరుపై కూడా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఆల్మాస్‌పేట సర్కిల్‌లో జరిగిన పరిణామాల కారణంగా ఇరువర్గాల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దీనికి సంబంధిత అధికారి తప్పిదాలే కారణమని పేర్కొన్నారు. అలాగే మాజీ మేయర్ పాక సురేష్ కుమార్ నివాసం వద్ద, ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి నివాసం వద్ద జరిగిన సంఘటనలు, ఇంటి పన్నుల వ్యవహారంలో చోటుచేసుకున్న అన్యాయాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలన్నింటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డిప్యూటీ సీఎం అంజద్ భాష, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్ , మాజీ కార్పొరేటర్ సుబ్బరాయుడు, మాజీ ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాపట్ల అభివృద్ధికి రూ.1,450 కోట్లు ఖర్చు చేశాం: ఎమ్మెల్యే నరేంద్ర వర్మ




బాపట్ల, సింధూరదర్శిని:
కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బాపట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఏర్పడిన టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విశేష పురోగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడుతున్న కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, మహిళా సాధికారత, అమరావతి నిర్మాణం, పోలవరం వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పారు. గత రెండేళ్లలో బాపట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.367 కోట్లు, సంక్షేమ పథకాల కోసం రూ.295 కోట్లు ఖర్చు చేశామని, అదనంగా స్టార్ హోటళ్లు, రిసార్ట్‌ల రూపంలో రూ.788 కోట్ల ప్రైవేట్ పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. మొత్తం రూ.1,450 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నియోజకవర్గంలో అమలయ్యాయని తెలిపారు. ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం అనే సిద్ధాంతంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పెట్టుబడులు, ఉద్యోగాలు, సంక్షేమం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ శాఖ చైర్మన్ గోలుగుంట్ల కోటేశ్వరరావు, బౌడా చైర్మన్ సలగల రాజశేఖర్, తూర్పు సత్రం చైర్‌పర్సన్ గుంటుపల్లి తులసికుమారి, ఏపీ శిల్పకళా చైర్మన్ మంజులారెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం నూతనంగా నియమితులైన టీడీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంధ్రేయ, మహిళా అధ్యక్షురాలు సబ్బినేని శ్రీదేవి, మండల అధ్యక్షుడు చెన్నుపాటి కిషోర్, ప్రధాన కార్యదర్శి శ్రీలం శ్రీనివాసరావు సహా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


## జిల్లా కలెక్టర్ ని కలిసి పలు అంశాలపై వినతిపత్రం

**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి**



కడప సింధూరదర్శిని:కడప జిల్లా కలెక్టర్ ని కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు వినతి పత్రాన్ని అందజేశారు అలాగే ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, దీనిపై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గత కొన్ని రోజులుగా నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర గారు వ్యవహరిస్తున్న తీరుపై కూడా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఆల్మాస్‌పేట సర్కిల్‌లో జరిగిన పరిణామాల కారణంగా ఇరువర్గాల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దీనికి సంబంధిత అధికారి తప్పిదాలే కారణమని పేర్కొన్నారు. అలాగే మాజీ మేయర్ పాక సురేష్ కుమార్ నివాసం వద్ద, ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి నివాసం వద్ద జరిగిన సంఘటనలు, ఇంటి పన్నుల వ్యవహారంలో చోటుచేసుకున్న అన్యాయాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఈ అంశాలన్నింటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డిప్యూటీ సీఎం అంజద్ భాష, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్ , మాజీ కార్పొరేటర్ సుబ్బరాయుడు , మాజీ ఎంపీటీసీ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.



## చక్కెర పూర్తిగా మానేస్తే ప్రమాదమా?

## కొత్త అధ్యయనం ఏం చెబుతోంది

పూర్తిగా మానేయడంపై పరిశోధనల్లో సందేహాలు

పేగుల ఆరోగ్యంపై ప్రభావం

ఇన్సులిన్ నిరోధకత పెరిగినట్లు గుర్తింపు

అధిక చక్కెర మాత్రం హానికరమే

బ్యాలెన్స్‌డ్ ఉత్తమమంటున్న నిపుణులు

బరువు తగ్గాలన్నా, షుగర్‌ను అదుపులో పెట్టాలన్నా చాలా మంది ముందుగా చేసే పని చక్కెరను తగ్గించడం. కొందరైతే పూర్తిగా మానేయడానికే ప్రయత్నిస్తారు. చక్కెర ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిదనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అయితే చక్కెరను పూర్తిగా ఆహారం నుంచి తొలగించడం వల్ల కూడా కొన్ని అనుకోని సమస్యలు రావొచ్చని తాజా అధ్యయనం చెబుతోంది. అమెరికాలో జరిగిన ఎండో 2026 సదస్సులో వెల్లడైన ఈ పరిశోధన ప్రస్తుతం ఆసక్తికర చర్చకు దారితీసింది.

**చక్కెర లేకపోతే ఏమైంది?**

పరిశోధకులు ఎలుకలను రెండు గ్రూపులుగా విభజించి 16 వారాల పాటు అధ్యయనం చేశారు. ఒక గ్రూపునకు చక్కెర ఉన్న తక్కువ కొవ్వు ఆహారం ఇవ్వగా మరో గ్రూపునకు చక్కెర లేని అదే తరహా ఆహారం అందించారు. తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు, ఇన్సులిన్ పనితీరు, పేగుల్లోని సూక్ష్మజీవులు, కాలేయ ఆరోగ్యం వంటి అంశాలను పరిశీలించారు. ఆశ్చర్యకరంగా, చక్కెర పూర్తిగా మానేసిన ఎలుకల్లో బరువు పెద్దగా తగ్గలేదు. పైగా రక్తంలో చక్కెర నియంత్రణ దెబ్బతినడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం, పేగుల ఆరోగ్యం బలహీనపడడం, కాలేయంలో వాపు వంటి సమస్యలు కనిపించాయి. దీంతో చక్కెరను పూర్తిగా తొలగించడం సరైన నిర్ణయం కాకపోవచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

**పేగుల ఆరోగ్యంతో సంబంధం ఏంటి?**

మన పేగుల్లో లక్షల కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి. ఇవే జీర్ణక్రియ నుంచి రోగనిరోధక శక్తి వరకు అనేక పనుల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సూక్ష్మజీవుల బ్యాలెన్స్ దెబ్బతింటే ఊబకాయం, మధుమేహం, కాలేయ సమస్యల వంటి అనారోగ్య పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉంటుంది. చక్కెరను పూర్తిగా మానేసిన ఎలుకల్లో ఈ సమతుల్యతలో మార్పులు కనిపించినట్లు అధ్యయనం వెల్లడించింది.

**అంటే చక్కెర ఎక్కువగా తినాలా?**

అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల ఊబకాయం, టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ అధ్యయనం చెప్పేది ఒక్కటే. చక్కెరను అధికంగా తీసుకోవడం హానికరం. అలాగే పూర్తిగా మానేయడం కూడా కొన్ని సందర్భాల్లో ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. అందుకే బ్యాలెన్స్‌డ్ డైట్ ఉత్తమమని పరిశోధకులు సూచిస్తున్నారు. ఈ అధ్యయనం ఎలుకలపై మాత్రమే జరిగింది. మనుషులపై మరింత లోతైన పరిశోధనలు జరగాల్సి ఉంది.

# ‘ఫాదర్స్ డే’ ఎలా మొదలైంది? వెనకున్న ఎమోషనల్ స్టోరీ తెలుసా?

ఓ కుమార్తె ఆలోచనతో ఫాదర్స్ డే ప్రారంభం - మదర్స్ డేలో పాల్గొన్న సోనోరా స్మార్ట్

తల్లి లేని తమను పెంచిన తండ్రి కోసం కూడా వేడుక చేయాలని ఆలోచన - 1910లో తొలి ఫాదర్స్ డే వేడుక

అమెరికా అధ్యక్షుల మద్దతుతో 1972లో అధికారిక గుర్తింపు



కుటుంబం కోసం తన కోరికలను పక్కన పెట్టి, పిల్లల భవిష్యత్తు కోసం నిశ్శబ్దంగా శ్రమించే వ్యక్తి తండ్రి. ఆయన ప్రేమ ఎక్కువగా మాటల్లో కనిపించకపోయినా.. ప్రతి నిర్ణయంలో, ప్రతి త్యాగంలో, ప్రతి బాధ్యతలో కనిపిస్తుంది. అలాంటి తండ్రుల సేవలను గుర్తు చేసుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా జూన్ మూడో ఆదివారం జరుపుకొనేదే ‘ఫాదర్స్ డే’. అయితే ఇప్పుడు కోట్లాది మంది జరుపుకొంటున్న ఈ ప్రత్యేక రోజు వెనుక ఓ కుమార్తె ప్రేమ, కృతజ్ఞత దాగి ఉందన్న విషయం చాలా మందికి తెలియదు.

**ఓ కుమార్తె మనసులో పుట్టింది**

ఫాదర్స్ డే కథ అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో ప్రారంభమైంది. సోనోరా స్మార్ట్ డాడ్ అనే యువతికి 1909లో మదర్స్ డే వేడుకలో పాల్గొన్న సమయంలో ఓ ఆలోచన తట్టింది. తల్లుల కోసం ప్రత్యేక రోజు ఉంటే, తన జీవితాన్ని పిల్లల కోసమే అంకితం చేసిన తండ్రుల కోసం ఎందుకు ఉండకూడదని ప్రశ్నించుకుంది. అదే తర్వాత ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ‘ఫాదర్స్ డే’గా మారింది.

**ఆ తండ్రి కథే ప్రపంచానికి స్ఫూర్తి**

సోనోరా తండ్రి విలియమ్ జాక్సన్ స్మార్ట్ మాజీ సైనికుడు. భార్య మరణించిన తర్వాత ఆరుగురు పిల్లలను ఒంటరిగా పెంచాడు. ఆ కాలంలో అది సాధారణ విషయం కాదు. కుటుంబ బాధ్యతలన్నీ భుజాన వేసుకుని పిల్లలకు ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నాడు. తన తండ్రి జీవితాన్ని దగ్గరగా చూసిన సోనోరా.. ఆయనలాంటి తండ్రులందరికీ గౌరవం దక్కాలని కోరుకుంది.

**చిన్న కార్యక్రమం నుంచి**

సోనోరా ప్రయత్నాలకు స్థానిక మత పెద్దలు, సామాజిక నాయకులు మద్దతు ఇవ్వడంతో 1910 జూన్ 19న అమెరికాలోని స్పోకేన్ నగరంలో తొలి ఫాదర్స్ డే నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. తండ్రులను సన్మానించారు. అక్కడ మొదలైన ఆ ఆలోచన క్రమంగా అమెరికా అంతటా వ్యాపించింది.

**అధికారిక గుర్తింపు కోసం**

‘ఫాదర్స్ డే’కు అమెరికా అధ్యక్షులు వుడ్‌రో విల్సన్, కాల్విన్ కూలిడ్జ్ వంటి నాయకులు మద్దతు ప్రకటించారు. అయినప్పటికీ అధికారిక గుర్తింపు రావడానికి చాలా కాలం పట్టింది. చివరకు 1972లో అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ఫాదర్స్ డేను జాతీయ వేడుకగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది జూన్‌లో మూడో ఆదివారం ‘ఫాదర్స్ డే’ను జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.


ఇప్పుడు ప్రపంచంలోని అనేక దేశాలు ఫాదర్స్ డేను నిర్వహించుకుంటున్నాయి. బహుమతులు, శుభాకాంక్షలు, కుటుంబ సమయం ఇవన్నీ ఈ రోజులో భాగమయ్యాయి. కానీ ఈ వేడుక వెనుక ఉన్న అసలు కథ మాత్రం ఒక కుమార్తె తన తండ్రికి చెప్పాలనుకున్న ‘ధన్యవాదాల’తో మొదలైందనేది మరువలేని విషయం.

# నీట్ రీ-టెస్ట్‌కు ముందు కేంద్రం సంచలన నిర్ణయం..“టెలిగ్రాం’ నిషేధం!

జూన్ 22 వరకు టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం - ఎన్‌టీఏ సూచనల మేరకు చర్యలు

పేపర్ లీక్ పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్న ఛానళ్లు - అభ్యర్థుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్న ముఠాలు

సైబర్ క్రైమ్ చర్యలు ఫలించకపోవడంతో నిర్ణయం - పరీక్షల పారదర్శకత కోసమే ఆంక్షలు



నీట్-యూజీ రీ-టెస్ట్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షకు సంబంధించిన తప్పుడు సమాచారం, నకిలీ ప్రశ్నపత్రాలు, పేపర్ లీక్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు టెలిగ్రామ్ సేవలను జూన్ 22 వరకు తాత్కాలికంగా నిలిపివేసింది. పరీక్షల పారదర్శకతను కాపాడడం, అభ్యర్థులను మోసం చేసే ప్రయత్నాలను అరికట్టడమే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పలు టెలిగ్రామ్ ఛానళ్లలో నీట్ ప్రశ్నపత్రాలు లీకయ్యాయని ప్రచారం చేస్తూ విద్యార్థులు, వారి కుటుంబాల నుంచి రూ.లక్షలు వసూలు చేసే ముఠాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఏ గుర్తించింది. »PAPER LEAKED NEETµ, »Re-NEET 2026µ, »Private Mafiaµ వంటి పేర్లతో నడుస్తున్న కొన్ని ఛానళ్లు ప్రశ్నపత్రాలు అందిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నాయని అధికారులు తెలిపారు. అయితే అసలు ప్రశ్నపత్రం పటిష్ఠ భద్రత మధ్య ఉంటుందని, బయటకు లీకయ్యే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రకటనలన్నీ పూర్తిగా మోసపూరితమైనవేనని హెచ్చరించారు. ‘ఇప్పటికే ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్’ ద్వారా ఆయా ఛానళ్లపై చర్యలు తీసుకునేందుకు ఎన్‌టీయే చర్యలు చేపట్టింది. కానీ, ఆశించిన ఫలితం రాకపోవడంతో టెలిగ్రామ్‌పైనే తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు ఎన్‌టీఏ తెలిపింది. పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

# ఎవరెస్ట్‌పై 30 ఏళ్ల మిస్టరీకి తెర?

-‘గ్రీన్ బూట్స్’ మృతదేహం కోసం ప్రత్యేక మిషన్


-డెత్ జోన్‌లో 30 ఏళ్లుగా పడి ఉన్న మృతదేహం

-తిరిగి తీసుకొచ్చేందుకు ఐటీబీపీ ప్రత్యేక ఆపరేషన్

-జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య మిషన్

-ఆ మృతదేహం ఎవరిదన్నది ఇప్పటికీ మిస్టరీనే

-1996లో ముగ్గురు పర్వతారోహకుల మృతి



ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో ఎవరెస్ట్ పర్వతంలోని ‘డెత్ జోన్’ ఒకటి. ఇక్కడ 30 ఏళ్లుగా పడి ఉన్న ఓ భారతీయ పర్వతారోహకుడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) ప్రత్యేక మిషన్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ‘గ్రీన్ బూట్స్’గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆ మృతదేహం మూడు దశాబ్దాలుగా ఎవరెస్ట్‌పై పర్వతారోహకులకు ఓ విషాద గుర్తుగా నిలిచింది.

ఈ ఆపరేషన్ కోసం నిపుణులైన హై ఆల్టిట్యూడ్ రికవరీ ఏజెన్సీని నియమించేందుకు ఐటీబీపీ టెండర్ జారీ చేసింది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య ఈ మిషన్‌ను చేపట్టే అవకాశముంది. 8,000 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్న డెత్ జోన్‌లోకి ప్రవేశించి మృతదేహాన్ని కిందకు తీసుకురావడం, అనంతరం నేపాల్ మార్గంగా భారత్‌కు తరలించడం ఈ మిషన్‌లో భాగం.

ఈ ఆపరేషన్‌లో కనీసం ఆరుగురు అనుభవజ్ఞులైన షెర్పాలను రంగంలోకి దించే అవకాశం ఉంది. టిబెట్‌లోని చైనా అధికారుల అనుమతులు పొందడం, సరిహద్దు దాటించడం, చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేయడం, దశాబ్దాలుగా మంచులో గడ్డకట్టిన మృతదేహాన్ని గౌరవప్రదంగా భద్రపరచడం వంటి బాధ్యతలు కూడా రికవరీ బృందానికే ఉంటాయి. ‘గ్రీన్ బూట్స్’గా ప్రసిద్ధి చెందిన ఈ మృతదేహం అసలు ఎవరిదన్నది ఇప్పటికీ పూర్తిగా నిర్ధారణ కాలేదు. 1996లో ఎవరెస్ట్‌ను అధిరోహించే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన ఐటీబీపీ బృందంలోని లాన్స్ నాయక్ దోర్జె మోరుప్ లేదా హెడ్ కానిస్టేబుల్ త్సేవాంగ్ పాల్జోర్‌దేనని భావిస్తున్నారు. ఆ ఏడాది జరిగిన విషాద ఘటనలో ముగ్గురు భారతీయ పర్వతారోహకులు మరణించగా వారిలో ఒకరి మృతదేహమే ‘గ్రీన్ బూట్స్’గా గుర్తింపు పొందింది.

# మెస్సీ, రొనాల్డో సరసన భారత మహిళా క్రికెటర్..
# స్మృతి మంధానకు అరుదైన గౌరవం

**టైమ్ 100 అత్యంత ప్రభావశీలుర జాబితాలో స్మృతి మంధాన - ఈ ఘనత సాధించిన ఏకైక భారత క్రీడాకారిణిగా గుర్తింపు**

**మెస్సీ, రొనాల్డో, లెబ్రాన్ జేమ్స్ వంటి దిగ్గజాల సరసన చోటు - రికార్డులు, జట్టు విజయాలతో మహిళల క్రికెట్‌లో ఆమెది కీలక పాత్ర**

**డబ్ల్యూపీఎల్ టైటిళ్లు, ప్రపంచకప్ విజయంతో అరుదైన రికార్డులు**



భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రఖ్యాత 'టైమ్' మ్యాగజైన్ 2026 సంవత్సరానికి గాను ప్రకటించిన 'క్రీడారంగంలో 100 మంది అత్యంత ప్రభావశీల వ్యక్తుల' జాబితాలో ఆమెకు చోటు దక్కింది. ఈ జాబితాలో స్థానం పొందిన ఏకైక భారత క్రీడాకారిణిగా స్మృతి నిలవడం విశేషం. ఈ ఘనతతో ఆమె ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనెల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో, బాస్కెట్‌బాల్ స్టార్ లెబ్రాన్ జేమ్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుల సరసన చేరింది. ప్రపంచ క్రీడారంగాన్ని తమ ప్రతిభ, నాయకత్వ పటిమ, పెట్టు బడులతో ప్రభావితం చేస్తున్న క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులతో ఈ జాబితాను రూపొందించినట్లు టైమ్ మ్యాగజైన్ వివరించింది. మహిళల క్రికెట్‌లో సరిహద్దులను చెరిపేస్తూ, అద్భుతమైన వ్యక్తిగత రికార్డులతో పాటు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నందుకే స్మృతిని ఈ జాబితాలో చేర్చినట్లు తన ప్రొఫైల్‌లో పేర్కొంది. "స్మృతి కోసం రికార్డులు బద్దలవుతూనే ఉన్నాయి" అని ప్రశంసించింది.

స్మృతి మంధాన సాధించిన పలు రికార్డులను కూడా టైమ్ మ్యాగజైన్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. దేశవాళీ వన్డే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి భారత మహిళగా, మూడు అంతర్జాతీయ ఫార్మాట్లలోనూ (టెస్ట్, వన్డే, టీ20) సెంచరీలు నమోదు చేసిన మొదటి భారత క్రీడాకారిణిగా ఆమె ఘనతను గుర్తుచేసింది. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో 17 సెంచరీలతో అత్యధిక శతకాలు బాదిన క్రీడాకారిణిగా సమంగా నిలిచారని, ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1,000 వన్డే పరుగులు పూర్తి చేసిన తొలి ప్లేయర్‌గా ఆమె రికార్డు సృష్టించారని వివరించింది. కేవలం వ్యక్తిగత రికార్డులే కాకుండా ఆమె నాయకత్వంలో జట్టుకు అందిన విజయాలను కూడా టైమ్ హైలైట్ చేసింది. 29 ఏళ్ల స్మృతి నాయకత్వంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 2024, 2026 సంవత్సరాల్లో ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టైటిళ్లను గెలుచుకుంది. గత ఏడాది జరిగిన ఐసీసీ మహిళల ప్రపంచకప్‌ను భారత్ గెలవడంలో ఆమె కీలక పాత్ర పోషించింది. ఆ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన వారిలో ఒకరిగా నిలిచింది. 2024లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక అంతర్జాతీయ పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన ఆమె, 2025లో తన రికార్డును తానే అధిగమించడం ఆమె నిలకడకు నిదర్శనం.



## మ్యాచ్ ముగియగానే వెళ్లిపోమన్నారు.. ఫిఫా, అమెరికాపై ఇరాన్ విమర్శలు

**మ్యాచ్ అనంతరం వెంటనే లాస్ ఏంజెల్స్ వీడాలన్నారని ఆరోపణ**

**వీసా సమస్యలతో సపోర్ట్ స్టాఫ్‌లో పలువురు గైర్హాజరు**

**'ప్రపంచకప్‌లో అత్యంత బాధిత జట్టు మాదే' అన్న కోచ్**

**ఫిఫా మరింత సహకరించాలని కోరిన కెప్టెన్ తారెమీ**

ఫిఫా ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో 2-2తో డ్రా అయిన తర్వాత ఇరాన్ జట్టు ఫిఫా యాజమాన్యం సహా అమెరికా అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మ్యాచ్ ముగిసిన వెంటనే లాస్ ఏంజెల్స్‌ను విడిచి మెక్సికోలోని తమ శిక్షణ కేంద్రానికి వెళ్లాలని ఆదేశించారని ఆరోపించింది. దీంతో ఆటగాళ్ల రికవరీ ప్రక్రియ దెబ్బతిందని ఇరాన్ ప్రధాన కోచ్ అమీర్ ఘలెనోయి ఆరోపించారు. టోర్నీలో పాల్గొంటున్న జట్లలో తమదే అత్యంత ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీమ్ అని అమీర్ వ్యాఖ్యానించారు. ఫెడరేషన్ ప్రతినిధులు, మీడియా సిబ్బంది, మేనేజ్‌మెంట్ సభ్యులు చాలామంది వీసాలు పొందలేకపోయారన్నారు. దీంతో జట్టు ప్రాక్టీస్, ఏర్పాట్లు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. ఇరాన్ కెప్టెన్ మెహ్దీ తారెమీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. టిజువానా నుంచి లాస్ ఏంజెల్స్‌కు ప్రయాణం సాధారణంగా కొన్ని గంటలే అయినా ఇమ్మిగ్రేషన్ ప్రక్రియల కారణంగా దాదాపు ఐదు గంటలు పట్టిందన్నారు. ఇటువంటి పరిస్థితులు ఆటగాళ్ల ఫిట్‌నెస్, మ్యాచ్ సన్నద్ధతపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. అయితే మ్యాచ్ అనంతరం ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్‌ఫాంటినో తమ డ్రెస్సింగ్‌రూమ్‌కు వచ్చి మాట్లాడారని తారెమీ వెల్లడించారు. ఫిఫా తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని సహకరించాలని కోరామన్నారు. మరోవైపు మెక్సికో ప్రభుత్వం, టిజువానా ప్రజలు తమకు అందించిన ఆతిథ్యాన్ని ఇరాన్ జట్టు ప్రశంసించింది.



## ఏఐ ఎఫెక్ట్..

**త్వరలో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు పెరగనున్నాయా?**

**ఏఐతో మెమరీ చిప్‌లకు డిమాండ్**

**ఏఐ మోడళ్లు, డేటా సెంటర్ల కోసం అధిక సామర్థ్య చిప్‌లు అవసరం**

**రానున్న కొన్నేళ్లలో డిమాండ్-సరఫరా మధ్యంతరం**

**భారత్‌పై గణనీయ ప్రభావం**

**ప్రత్యామ్నాయ మార్గాలపై కంపెనీల దృష్టి**

**తక్షణం ప్రభావం ఉండకపోవచ్చని అంచనా**

కొత్త స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ కొనుగోలు చేసే సమయంలో చాలా మంది కెమెరా, స్టోరేజ్, ర్యామ్, ప్రాసెసర్ వంటి అంశాలనే పరిశీలిస్తారు. కానీ ప్రస్తుతం ప్రపంచ టెక్నాలజీ రంగంలో అత్యంత కీలకంగా మారింది ఈ పరికరాల్లో ఉపయోగించే మెమరీ చిప్‌లే. కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధి కోసం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోటీ కారణంగా ఈ చిప్‌లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఏఐ మోడళ్లు, డేటా సెంటర్ల కోసం అధిక సామర్థ్యం గల మెమరీ చిప్‌లు అవసరం అవుతున్నాయి. దీంతో తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రధానంగా ఏఐ రంగం వైపు మళ్లిస్తున్నాయి. ఫలితంగా స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ల వంటి వినియోగదారుల ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఉపయోగించే మెమరీ చిప్‌ల సరఫరా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పెద్దగా ప్రభావం కనిపించకపోయినా రానున్న కొన్నేళ్లలో డిమాండ్-సరఫరా మధ్య అంతరం మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌పై ఈ ప్రభావం గణనీయంగా ఉండనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశీయ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 2030 నాటికి 120 బిలియన్ డాలర్లను దాటే అవకాశముంది. ముఖ్యంగా రెండు, మూడో శ్రేణి నగరాల్లో స్మార్ట్‌ఫోన్‌లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. అయితే మెమరీ చిప్‌ల ధరలు పెరిగితే కంపెనీలు ఉత్పత్తుల కాన్ఫిగరేషన్లను మార్చడం, ఆఫర్లను తగ్గించడం లేదా ధరలను పెంచడం వంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితిని ఎదుర్కొనేందుకు కంపెనీలు ప్రత్యామ్నాయ సరఫరాదారులను వెతకడం, నిల్వలను పెంచడం, స్థానిక తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నాయి. అందువల్ల ఇప్పటికిప్పుడు వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయినా రానున్న కాలంలో గ్యాడ్జెట్ల ధరలపై ఏఐ ప్రభావం కనిపించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# ఆసుపత్రిలోనే భర్తకు విషం... గుండెపోటుగా చిత్రీకరణ..
# ప్రియుడి సోషల్ మీడియా పోస్టుతో బట్టబయలు!

- కర్ణాటకలో మాజీ సైనికుడి మృతి ప్రమాదం కాదన్న పోలీసులు
- రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బు కోసం భార్య, ఆమె ప్రియుడు కలిసి ఈ ఘాతుకం
- ఆసుపత్రిలో సెలైన్ ద్వారా విషం ఎక్కించి, గుండెపోటుగా చిత్రీకరించేందుకు విఫలయత్నం
- నిందితుడి సోషల్ మీడియా పోస్టుతో అనుమానం - విచారణ చేపట్టగా అసలు కుట్ర వెలుగులోకి



కర్ణాటకలోని బెళగావి జిల్లాలో జరిగిన ఒక మాజీ సైనికుడి మృతి కేసు సంచలనం సృష్టిస్తోంది. సాధారణ బైక్ ప్రమాదంగా భావించిన ఈ ఘటన రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బు కోసం భార్య, ఆమె ప్రియుడు కలిసి పన్నిన దారుణ హత్యగా పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో మృతుడి భార్య, ఆమె ప్రియుడితో పాటు వైద్యులు, ఫోరెన్సిక్ సిబ్బంది సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

**ప్రమాదంతో మొదలై హత్యగా తేలింది**

మాజీ సైనికుడు సందీప్ మంజర్గి మార్చి 13న బైక్‌పై నుంచి జారిపడి స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అతని భార్య సుమ మంజర్గి, మొదట హుక్కేరి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఘటప్రభలోని జేజీ ఆసుపత్రికి మార్చింది. అయితే, మార్చి 15న సందీప్ గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బీఐఎంఎస్ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక ఫోరెన్సిక్ నివేదికలో కూడా ఎలాంటి విష ప్రయోగం జరగలేదని, గుండెపోటు వల్లే మరణం సంభవించిందని పేర్కొన్నారు.

**సోషల్ మీడియా పోస్టుతో తిరిగిన కథ**

ప్రమాదంలో తీవ్ర గాయాలు కాకపోవడం ఆరోగ్యంగా ఉన్న సందీప్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంపై పోలీసులకు అనుమానం కలిగింది. ఈ క్రమంలో సుమ ప్రియుడుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పుండలీక్ దొంబార్ పెట్టిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ కేసును కీలక మలుపు తిప్పింది. "ప్రమాదానికి గురైన వ్యక్తి అకస్మాత్తుగా ఎలా చనిపోయాడు?" అంటూ తనకు అంతా తెలిసినట్లుగా అతను పోస్ట్ పెట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు కుట్ర మొత్తం బయటపడింది.

**రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ కోసం దారుణం**

పోలీసుల కథనం ప్రకారం సందీప్, పుండలీక్ గతంలో కలిసి హోటల్ వ్యాపారం చేశారు. ఈ క్రమంలోనే సందీప్ భార్య సుమతో పుండలీక్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదే సమయంలో సందీప్ పేరు మీద మూడు వేర్వేరు కంపెనీల నుంచి సుమారు రూ.2 కోట్ల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నారు. ఆ డబ్బును కాజేయాలనే దురుద్దేశంతోనే ఈ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు గుర్తించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సుమ, పుండలీక్ కలిసి సెలైన్ బాటిల్ ద్వారా విషాన్ని, నిద్రమాత్రలను ఇచ్చి సందీప్‌ను హత్య చేశారు. అనంతరం ఈ హత్యను గుండెపోటుగా చిత్రీకరించేందుకు వైద్య, ఫోరెన్సిక్ సిబ్బందికి రూ.3 లక్షలకు పైగా లంచం ఇచ్చి నివేదికలను తారుమారు చేయించారు. నిందితుల నుంచి విషం సీసాలు, సిరంజిలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సందీప్ భార్య సుమ, ప్రియుడు పుండలీక్‌తో పాటు డాక్టర్ బసవరాజ్, ఎఫ్‌డీఏ అధికారి అశోక్, ఎఫ్ఎస్ఎల్ క్లర్క్ అప్పాసాహెబ్ సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేశారు. ఇటీవల తెలంగాణలోని కామారెడ్డి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. అక్కడ కూడా భర్తను హత్య చేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి ఇన్సూరెన్స్ డబ్బు పొందాలని చూసిన భార్య, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# 19న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలి

ఒంగోలు, సింధూరదర్శిని:గ్రామాల నుండి వేలాదిగా రైతులు తరలివచ్చి ఈనెల 19వ తేదీన తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఎంఎన్ఎస్ భవన్‌లో ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు సివిఎస్ సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చుండూరి రంగారావుతో పాటు ఏపి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, రైతు సంఘం నాయకులు జయంతి బాబు, వీరారెడ్డి, హనుమంతరావు, కరిటాల




కోటేశ్వరరావు, వాసు, ప్రభాకర్‌లు పాల్గొన్నారు. రోజు రోజుకు పొగాకు వ్యాపార కంపెనీలు ధరలు తగ్గించి నిలువునా పొగాకు రైతుల శ్రమను దోచుకుంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పొగాకు బోర్డు కలిసి వ్యాపార కంపెనీలపై వత్తిడి తీసుకొచ్చి గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం అయ్యాయన్నారు. ఈ సంక్షోభ పరిస్థితుల్లో పార్టీ జెండాలు, రాజకీయాలు పక్కన పెట్టి రైతు ప్రయోజనాలు పరిరక్షణ కోసం, ఎస్‌కెఎం జెండా కింద రైతులందరూ ఏకమై తమ బలాన్ని, ఆవేదనను వెల్లడించాలని సమావేశంలో నేతలు పిలుపునిచ్చారు.

# సినిమా న్యూస్



వెండి రంగు సీక్విన్ దుస్తుల్లో దివ్యాంశ కౌశిక్ అద్భుతమైన స్టూడియో లుక్‌తో మెరిసిపోతున్నారు. మెరిసే సిల్వర్ సీక్విన్ క్రాప్ టాప్ మరియు గ్రే రంగు డ్రేప్డ్ స్కర్ట్ ధరించి, ఆత్మవిశ్వాసం మరియు హుందాతనాన్ని ప్రదర్శిస్తున్న దివ్యాంశ కౌశిక్ ఈ స్టూడియో చిత్రంలో ఆకట్టుకుంటున్నారు.

## స్టార్‌డమ్‌తో నాలో అహంకారం పెరిగింది: సమంత



స్టార్‌డమ్‌ను చూసి ఆశ్చర్యపోయానన్న సమంత
వరుస హిట్లతో స్టార్‌డమ్‌కు బానిసయ్యానని వ్యాఖ్య
నటిగా అహంకారం పెరిగి తనకు ముగింపు లేదనుకున్నానని వెల్లడి
అనారోగ్యంతో తీసుకున్న విరామం ఆలోచనలను మార్చిందన్న హీరోయిన్
జూన్ 19న ప్రేక్షకుల ముందుకు 'మా ఇంటి బంగారం' సినిమా

స్టార్‌డమ్ మత్తులో తాను కూడా కొట్టుకుపోయానని, వరుస విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని ప్రముఖ నటి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనారోగ్య వల్ల ఇటీవల తీసుకున్న విరామం తన జీవితాన్ని, కెరీర్‌ను కొత్త కోణంలో చూసేలా చేసిందని వెల్లడించారు. 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "చిన్న పట్టణం నుంచి వచ్చిన ఓ అమ్మాయిగా స్టార్‌డమ్‌ను అనుభవించడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ప్రేక్షకులు నా పేరును అరుస్తూ, నా సినిమాల కోసం ఎదురుచూడటం చూసి మరింత కష్టపడ్డాను. ఓ దశలో స్టార్‌డమ్ అనే ఆటకు బానిసయ్యాను. ఏడాదిలో ఐదు సినిమాలు చేశాను. అవన్నీ హిట్లు కావడంతో నాకో 'గోల్డెన్ లెగ్' ఉందని అందరూ అనేవారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉండాలనే ఒత్తిడిని నేనే నాపై పెట్టుకున్నా" అని చెప్పారు. "అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఇంకా ఎక్కువ సినిమాలు చేయాలనుకునేదాన్ని. నటిగా నాకు ముగింపు ఉండదనుకున్నాను. అదే ఒక రకమైన అహంకారం. కానీ ఆ విరామం తర్వాత నా కెరీర్‌కూ ఓ ముగింపు ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకున్నా. అది నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చింది. తిరిగి సినిమాల్లోకి వస్తే కొన్ని పాత అలవాట్లు మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నా" అని సమంత తెలిపారు. 2022లో తాను మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్నట్లు సమంత వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న విడుదల కానుంది.

## సంక్రాంతి 2027 రేసు: కలగాపులగం కానున్న బాక్సాఫీస్!




తెలుగు చలనచిత్ర పరిశ్రమకు సంక్రాంతి సీజన్ అంటే పండగ మాత్రమే కాదు. అది బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించే అతిపెద్ద గోల్డెన్ విండో. ప్రతి ఏటా లాగే ఈసారి కూడా 2027 సంక్రాంతి రేసు అత్యంత ఆసక్తిక రంగా మారిపోయింది. టాలీవుడ్ అగ్ర హీరోల నుంచి పాన్-ఇండియా స్టార్స్ వరకు అంతా జనవరి స్లాట్‌ను టార్గెట్ చేయడంతో థియేటర్ల వద్ద మునుపెన్నడూ లేని విధంగా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి.

ఈ సంక్రాంతి రేసులో అందరికంటే ముందుగా మెగాస్టార్ చిరంజీవి జెండాను పాతేశారు. -వాల్తేరు వీరయ్య- వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం ఈ పండగ బరిలో నిలవడం దాదాపు ఖరారైంది. ప్రీమియర్‌తోనే హైప్ పీక్స్‌కు! మెగాస్టార్ మార్క్ వింటేజ్ మాస్ ఎలిమెంట్స్, బాబీ పవర్‌ఫుల్ ఎలివేషన్లు తోడైతే పండగ పూట థియేటర్లలో పూనకాలు గ్యారెంటీ అని మెగా అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పండగ సీజన్ అంటే కేవలం మాస్ యాక్షన్ మాత్రమే కాదు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను మెప్పించే ఎంటర్‌టైనర్లకు కూడా ఇక్కడ పెద్ద పీట వేస్తారు. ఈ క్రమంలోనే విక్టరీ వెంకటేష్ – సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సరికొత్త చిత్రం సంక్రాంతి రేసును మరింత రసవత్తరంగా మార్చనుంది. వీరితో పాటు టాలెంటెడ్ హీరో శర్వానంద్, సీనియర్ దర్శకుడు శ్రీను వైట్ల కలయికలో తెరకెక్కుతున్న హిలేరియస్ ఫ్యామిలీ అండ్ యాక్షన్ డ్రామా కూడా పండగ బరిలోనే నిలవనుండటంతో క్లాస్, కామెడీ కంటెంట్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు బోలెడన్ని ఆప్షన్లు దొరికినట్లయింది. సాధారణంగా టాలీవుడ్ సంక్రాంతి రేసు అనగానే నందమూరి బాలకృష్ణ, కింగ్ నాగార్జున సినిమాలు కచ్చితంగా లైన్లో ఉంటాయనేది ఇండస్ట్రీ సెంటిమెంట్. అయితే ఆ ఇద్దరు ఈసారి 2027 సంక్రాంతి బరి నుంచి తప్పుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తమ చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ మారడం ..థియేటర్ల లభ్యతను దృష్టిలో ఉంచుకుని సీనియర్ హీరోలు ఇద్దరూ తమ సినిమాలను వేరే సీజన్‌కు పోస్ట్‌పోన్ చేసుకునే యోచనలో ఉన్నట్లు ఫిలిం నగర్ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. ప్రాంతీయ చిత్రాల హడావుడి ఇలా ఉంటే? బాక్సాఫీస్ వద్ద అసలైన ముప్పు పాన్-ఇండియా దిగ్గజాల రూపంలో పొంచి ఉంది. కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ -టాక్సిక్- తో పాటు రెబల్ స్టార్ ప్రభాస్ – హను రాఘవపూడిల కాంబినేషన్‌లో తెరకెక్కుతోనన ప్రతిష్టాత్మక పీరియాడిక్ వార్ డ్రామా -ఫౌజీ- కూడా ఇదే జనవరి విండోను టార్గెట్ చేస్తున్నట్లు సమాచారం.

ఈ రెండు భారీ పాన్-ఇండియా చిత్రాలు గనుక సంక్రాంతి రేసులోకి అధికారికంగా అడుగుపెడితే స్క్రీన్ల కేటాయింపు విషయంలో టాలీవుడ్‌లో పెద్ద యుద్ధమే జరగడం ఖాయం. మరో ఆరు నెలల ముందే సంక్రాంతి 2027 బాక్సాఫీస్ వాతావరణం కలగాపులగంగా మారిపోయింది. ఒకవైపు మెగాస్టార్ మాస్ పవర్, మరోవైపు వెంకీ-అనిల్ రావిపూడిల ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, వీటికి తోడు ప్రభాస్, యష్ ల పాన్-ఇండియా భారీతనం.. ఇలా అన్ని జోనర్లు ఒకేసారి ఢీకొట్టబోతున్నాయి. ఈ విపరీతమైన పోటీ వల్ల సినిమాల వసూళ్లపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున, ఎగ్జిబిటర్లు , డిస్ట్రిబ్యూటర్లు థియేటర్లను ఏ విధంగా సర్దుబాటు చేస్తారనేది రాబోయే రోజుల్లో పెద్ద పరీక్షగా మారనుంది.



## టైగర్స్ మళ్లీ గర్జించబోతున్నారు.. ప్రీమియర్‌తోనే హైప్ పీక్స్‌కు!

తెలుగు ఓటీటీ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సేవ్ ది టైగర్స్ మూడో సీజన్ కు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే రెండు సీజన్లతో ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు మరింత వినోదంతో తిరిగి వస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సేవ్ ది టైగర్స్ సీజన్3 స్పెషల్ ప్రీమియర్ ఈవెంట్ ఆకట్టుకుంది. సినీ, టెలివిజన్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై ఈ ఈవెంట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచారు. హైదరాబాద్‌లోని ఏఎంబీ సినిమాస్‌లో జరిగిన ఈ ప్రీమియర్ సందడి వాతావరణంలో సాగింది. సిరీస్‌కు సంబంధించిన నటీనటులు, టెక్నికల్ టీమ్, క్రియేటర్లు, స్పెషల్ గెస్టులు ఒకే వేదికపై కనిపించడంతో వేడుకకు మరింత కళ వచ్చింది. ఈ ప్రీమియర్ కు హీరో సందీప్ కిషన్‌తో పాటూ కామాక్షి భాస్కర్ల, రాగ్ మయూర్, వీజే సన్నీ, కళ్యాణ్ పడాలా, చైతన్య రావు, వెంకటేష్ కాకుమాను, కార్తిక్ రత్నం, ఆదిత్య మండల, శ్రీనాథ్ మాగంటి, ముక్కు అవినాష్, నిరుపమ్, కిరీటి దామరాజు, మానస్ తదితరులు పాల్గొన్నారు. పలువురు అతిథులు సిరీస్‌లోని ఎపిసోడ్‌లను వీక్షించి తమ అభిప్రాయాలను పంచుకున్నారు. స్క్రీనింగ్ తర్వాత సిరీస్‌లో కనిపించిన పాత్రలు, కథనం, కామెడీ సీన్స్ పై సెలబ్రిటీల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ముఖ్యంగా ప్రియదర్శి, జోర్దార్ సుజాత, కృష్ణ చైతన్య, దేవియాని శర్మ, అభినవ్ గోమటం, పావని గంగిరెడ్డి నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ప్రీమియర్ చూసిన వారు చెప్తున్నారు. వెన్నెల కిషోర్ చేసిన స్పెషల్ క్యామియో ప్రత్యేక పాత్ర కూడా ఈ సీజన్‌లో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తుందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు వచ్చిన రెండు సీజన్లలో ఫ్యామిలీ బాండింగ్స్, దాంపత్య జీవితంలోని ఫన్నీ ఇన్సిడెంట్స్, నేచురల్ కామెడీతో ఆడియన్స్ ను అలరించిన సేవ్ ది టైగర్స్ ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో ముందుకు వస్తోంది. మేకర్స్ తెలిపిన వివరాల ప్రకారం, మూడో సీజన్‌లో ఫ్యాంటసీ అంశాలు కూడా కథలో భాగమవడంతో ఎంటర్టైన్మెంట్ నెక్స్ట్ లెవెల్ లో ఉండనుందని అర్థమవుతుంది. రెండు భిన్న ప్రపంచాల మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలు కథను ముందుకు నడిపించనున్నట్లు తెలుస్తోంది.



## సాయి పల్లవి ఓకే.. మరి ఆలియా సంగతేంటి?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్‌లో టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. మైథాలజీ బ్యాక్ డ్రాప్‌ను సైన్స్ ఫిక్షన్ తో మిక్స్ చేసి రూపొందించిన ఆ విజువల్ వండర్ కు నేషనల్ వైడ్‌గా ప్రేక్షకుల నుంచి సూపర్ రెస్పాన్స్ లభించింది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్ గా రూపొందుతున్న కల్కి-2పై కూడా అదే రేంజ్ లో అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. అయితే మూవీ స్టోరీ, పాత్రల కంటే ఎక్కువగా కొత్తగా ఎవరు ఆ ప్రాజెక్టులో భాగమవుతున్నారనే విషయమే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ పేరు తాజాగా తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది. ఆలియా భట్ కల్కి-2లో కీలక పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే నెట్టింట వైరల్ అయిన వార్తల్లా ఆమె ఫస్ట్ పార్ట్ లో మరో బీటౌన్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె పోషించిన సుమతి పాత్ర చేయడం లేదని తెలుస్తోంది. మూవీలో కీలక మలుపు తీసుకొచ్చే ఓ పవర్ ఫుల్ స్పెషల్ రోల్ కోసం ఆమెను సెలెక్ట్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఆలియా ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొంత భాగం షూటింగ్ ను కూడా పూర్తి చేసిందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనిపై మూవీ యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అఫీషియల్ అనౌన్స్మెంట్ రాలేదు. దీంతో ఆ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మరోవైపు, దీపికా పదుకొణె ప్లేస్ లో స్టార్ హీరోయిన్ సాయి పల్లవి నటించబోతున్నారనే వార్తలు రీసెంట్ గా వినిపించాయి. అయితే ఆ ప్రచారానికి దర్శకుడు నాగ్ అశ్విన్ రీసెంట్ గా చెక్ పెట్టారు. సాయి పల్లవి ఎంట్రీపై వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. దీంతో ఇప్పుడు ఆలియా భట్ విషయంలో అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410.
Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662